# మెస్సీయాను గూర్చిన ప్రవచనములు

## దావీదు కుమారుడు (2 సమూ. 7:12)

క్రీ.పూ. 1000 ప్రాంతంలో, రాజైన దావీదు సుస్థిరమైన ఆలయాన్నొకటి దేవుని నివాసంగా కట్టగోరాడు. దానికి జవాబుగా దేవుడు దావీదు కోసం యింటిని కట్టే తన ఉద్దేశ్యాన్ని తెలియజేశాడు (2 సమూ. 7:11). దావీదుకొరకు దేవుడు కట్టబూనిన యిల్లు కలపతోను, రాతితోను కూడింది కాదు: అది దావీదు సంతతిని గూర్చినది. అది కుటుంబానికి సంబంధించిన యిల్లు, అతని పుత్ర పౌత్రులకు, తన సంతతికి సంబంధించినది. దేవుడు నేరుగా దావీదు కుమారుడై సొలొమోనుకు సంబంధించి మాట్లాడాడు:

> అతడు నా నామ ఘనతకొరకు ఒక మందిరమును కట్టించును; అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను; నేనతనికి తండ్రినైయుందును. అతడు నాకు కుమారుడై యుండును; ... నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును, నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును (2 సమూ. 7:13, 14ఎ, 16).

అయినా, పరోక్షంగా దేవుడు "బహు కాలము జరిగిన తరువాత నీ దాసుడనైన నా సంతానమునకు కలుగబోవుదానిని గూర్చి" సెలవిచ్చియున్నాడు (2 సమూ. 7:19). ఆ ప్రవచనం, వాగ్దానం సొలొమోను రోజులను మించి చేరింది.

దేవుని మాట వాగ్దానం రూపంలో యివ్వబడింది: "అతని సంతానము శాశ్వతముగా ఉండుననియు; అతని సింహాసనము సూర్యుడున్నంత కాలము నా సన్నిధిని ఉండుననియు చంద్రుడున్నంతకాలము అది నిలుచుననియు ... నా పరిశుద్ధతతోడని నేను ప్రమాణము చేసితిని దావీదుతో నేను అబద్ధమాడను." (కీర్తన. 89:35–37); "యెహోవా సత్యప్రమాణము దావీదుతో చేసెను ఆయన మాట తప్పనివాడు: '–నీ గర్భఫలమును నీ రాజ్యముమీద నేను నియమింతును' " (కీర్తన. 132:11ఎ, 12). దావీదు కుమారుని ఏలికలు, రాజులు, జనములు వ్యతిరేకించినా (కీర్తన. 2:1–3), దేవుడు తన వాగ్దానాన్ని నెరవేర్చడానికి తీర్మానించుకున్నాడు. "–నేను నా పరిశుద్ధ పర్వతమైన సీయోను మీద నా రాజును ఆసీనునిగా చేసియున్నాను" అని దేవుడు చెప్పనైయున్నట్టు కీర్తన రచయిత

ప్రవచించాడు (కీర్తన. 2:6). దావీదు సంతతిని గూర్చి దేవుడు ఏమి చెప్పబోతాడో కూడా కీర్తన రచయిత ప్రవచించాడు: "నీవు నా కుమారుడవు, నేడు నిన్ను కనియున్నాను" (కీర్తన. 2:7).

అతని సంతానాన్ని గూర్చి అసాధారణమైన ప్రవచనాలు దావీదు పలికేలా పరిశుద్ధాత్ముడు అనుమతించాడు. తన వారసుడు తనకు "ప్రభువట" (కీర్తన. 110:1). తండ్రి తన కుమారుని యొక్క యాజమాన్యము, అధికారము క్రిందికి రావడం చాలా అసాధారణమైన విషయం; అయినా తన కుమారునికి తాను క్రిందివాడే అయ్యున్నట్టు అతడు స్పష్టంగా ప్రవచించాడు. పైగా, తన వారసుని అధికార స్థానము భూసంబంధమైన యెరూషలేము కాక, దేవుని "కుడిపార్శ్వ"మని అతడు ముందుగా చూచాడు (కీర్తన. 110:1). తన కుమారుడు ఒకేసారి రాజును యాజకుడును అయి ఉంటాడని దావీదు ప్రవచించినది చాలా అసాధారణమైనది: "మెల్కీసెదకు క్రమము చొప్పున నీవు నిరంతరము యాజకుడవైయుందువని యెహోవా ప్రమాణము చేసియున్నాడు, ఆయన మాట తప్పనివాడు" (కీర్తన. 110:4; జెకర్యా 6:13). దావీదు యాజకుడు కాదు, యాజకుడుగా ఉండనేరడు; అతని సింహాసనము పరలోకములో దేవుని కుడిపార్శ్వమున ఉన్నది కాదు. ఈ మాటల్లో, దావీదు తన కుమారునియొక్క ప్రాధాన్యతను గుర్తిస్తున్నాడు.

దీనికితోడు, నిరంతరం ఎవని సింహాసనం నిలుస్తుందో వానిని గూర్చి దావీదు పలికి (కీర్తన. 45:6), ఆ వ్యక్తిని "దేవా" అని సంబోధించాడు. ధైర్యంగా చేయబడిన ఈ ప్రవచనాలు ఎప్పుడైనా ఎలా నెరవేర్చబడతాయి? దావీదు కుమారుని శాశ్వత సింహాసన ముంటుంది; అతడు దావీదుకే ప్రభువైయుంటాడు, అతడు దేవుని కుడిపార్శ్వమున ఉంటాడు, అతడు దేవుడైయుంటాడు!

దావీదు మరణానంతరం దాదాపు రెండువందల సంవత్సరాలకు, హోషేయ భవిష్యత్తులోనికి చూచి, అంత్య దినములలో "దేవుని" మరియు "తమ రాజైన దావీదును" ఇశ్రాయేలీయులు వెదకుతారని చెప్పాడు (హోషేయ 3:5). చనిపోయిన రాజు అని అతని భావం కాదు, "దావీదు" అని న్యాయ సమ్మతంగా పిలువబడిన అతని సంతతి అనే భావం విదితమైయుంది.

ఎనిమిదవ శతాబ్దపు ప్రవక్తయైన యెషయా ప్రకారము, రాబోతున్న దావీదు వారసుడు, ప్రఖ్యాతిగల తన తండ్రిని మించిపోతాడు. "దావీదు సింహాసనం మీద కూర్చుండి దాన్ని ఏలేవానికి," ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలవంతుడైన దేవుడు, నిత్యుడగు తండ్రి, సమాధాన కర్తయగు అధిపతియనే బిరుదులు ధరించియుంటాడని తెలిపాడు (యెషయా 9:6, 7). అతని పరిపాలన ఎలాటిదైయుంటుందో కూడా అతడు ప్రవచించాడు: "కృపవలన సింహాసనము స్థాపింపబడును, సత్యసంపన్నుడై దానిమీద కూర్చుండి తీర్పుతీర్చు నొకడు కలడు దావీదు గుడారములో అతడాసీనుడై న్యాయము విచారించుచు న్యాయము జరిగించుటకై తీవరించును" (యెషయా 16:5).

అతనికి సర్వాధికారమిత్తునని దేవుడు వాగ్దానం చేశాడు: "నేను దావీదు ఇంటి తాళపు అధికార భారమును అతని భుజముమీద ఉంచెదను అతడు తీయగా ఎవడును మూయజాలడు" (యెషయా 22:22). ఈ వారసుని ద్వారా, దేవుని నిత్య నిబంధనలో

ప్రవేశించడానికి గాను జనులు ఆహ్వానింపబడతారని "దావీదుకు చూపిన శాశ్వత కృప" వారికి చూపబడునని యెషయా తెలిపాడు (యెషయా 55:3). దావీదు మృతిపొందిన రమారమి నాల్గువందల సంవత్సరాలకు, పరలోకము యొక్క శాశ్వత వాగ్దానాన్ని స్థిరపరచడానికి దేవుడు యిర్మీయాను కూడా ఉపయోగించుకొన్నాడు (యిర్మీయా 33:20, 21).

దావీదు మరణించిన అయిదు వందల సంవత్సరాలకు, యూదులు బబులోనులో ఉండగా, దావీదుకు సంబంధించిన వాగ్దానాన్ని దేవుడు తిరిగి స్థిరపరచాడు: "వాటిని మేపుటకై నేను నా సేవకుడైన దావీదును వాటిమీద కాపరినిగా నియమించెదను, ... యెహోవానైన నేను వారికి దేవుడనై యుందును, నా సేవకుడైన దావీదు వారిమధ్య అధిపతిగా ఉండును" (యెహెజ్కేలు 34:23, 24). హోషేయ ప్రవచనంలో ఆయన అన్నట్టే, దావీదు వారసుడు దావీదేయన్నట్టు యెహెజ్కేలు ద్వారా దేవుడు సూచించాడు. అప్పుడు దేవుడు తన వాగ్దానాన్ని తిరిగి యిలా చెప్పాడు: "నా సేవకుడైన దావీదు వారికి రాజవును, ... నా సేవకుడైన దావీదు ఎల్లకాలము వారికి అధిపతియై యుండును" (యెహెజ్కేలు 37:24, 25).

దావీదు యొక్క దైవికమైన వారసుని గూర్చి "బహుకాలము జరిగిన తరువాత" (2 సమూ. 7:19) నెరవేరనైయుండిన, ఉలికిపడునట్టు చేసే ప్రవచనాలు, దావీదు సమాధిలో పెట్టబడిన దాదాపు వెయ్యి సంవత్సరాలకు నెరవేరనారంభించాయి. దేవదూత యైన గబ్రియేలు రాకతో భయ కంపితురాలైన మరియ అను నజరేతు కన్యకు, కుమారుడు పుడతాడని దూత తెలియజేస్తాడు. "ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; **ప్రభువైన** దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును" (లూకా 1:32) అని ఆ దూత ఆమెకు అభయమిస్తాడు. దేవుడు చాలా కాలము క్రిందట చేసిన తన వాగ్దానం: "నేనతనికి తండ్రినైయుందును, అతడు నాకు కుమారుడై యుండును" త్వరలో నెరవేర్చనైయున్నాడు (2 సమూ. 7:14ఎ). "పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును" అని అతడు ఆమెతో చెప్పాడు (లూకా 1:35).

యూదులు క్రీస్తును కేవలం దావీదు భౌతికమైన కుమారుడని తలంచారే గాని, ఈ విశ్వానికి ఆయన ప్రభువైయున్నాడన్న దృష్టితో ఆయన్ను చూడలేదు. తన కుమారుడు తనకే ప్రభువై ఉంటాడని దావీదు చేసిన ప్రవచనాన్ని యేసు వారికి సూచించినప్పుడు, వారికి ఇక మాట్లాడడానికి ఏదీ లేకుండా పోయింది (మత్తయి 22:41-46).

దావీదే గాని యింక ఎవడే గాని, ఎప్పుడే గాని చేయని ఒక కార్యాన్ని యేసు చేశాడు, ఇక "కుళ్లు పట్టకుండ ఆయనను మృతులలోనుండి లేపుటను బట్టి" (అపొ. 13:34) "దావీదునకు అనుగ్రహించిన పవిత్రమైన వరములను" ఆయన పొందుటకు సిద్ధమైయున్నాడు. ఎనిమిది శతాబ్దాలకు ముందే యెషయా ప్రవచించినట్టు (యెషయా 55:3) యిది జరిగింది. దావీదునకు వారసుడైనవాడు నిరంతరము దావీదు యొక్క సింహాసనమందు ఆసీనుడైయుంటాడని దావీదుకు పవిత్ర వరము వాగ్దానం చేయబడినది (2 సమూ. 7:12-14), మరెన్నడు మృతిపొందని అతని వారసునియందు అద్భుతంగా నెరవేర్చబడింది.

దేవుని ఏర్పాటులో క్రీస్తు పునరుత్థానము ఎంత ప్రాముఖ్యమైనదంటే, నీవు "నా

కుమారుడవు"గా ఉండుటకు "నేడు నిన్ను కనియున్నాను" అని దేవుడు దీనిని సూచించాడు (కీర్తన. 2:7బి; అపొ. 13:33; రోమా 1:4). ఆయన పునరుత్థానానికి ముప్పైమూడు సంవత్సరాలకు ముందుగానే, యేసు దేవుని కుమారుడని (లూకా 1:35) పిలువబడ్డాడు. అయితే, అలంకారికంగా, మృతులలోనుండి లేచిన దినము ఆయన దేవుని కుమారుడైన దినము (అపొ. 13:33).

పునరుత్థానుడైన యాభై దినాలకు, పరలోకమందు దేవుని కుడిపార్శ్వమున ఆత్మ సంబంధమైన దావీదు సింహాసనము మీద ఆయన ఆసీనుడైయున్నాడు (అపొ. 2:29-31). ఇది పలు ప్రవచనాలను నెరవేర్చుతుంది: కీర్తనలు 2:6; 132:11; 89:34-37; యెషయా 9:6, 7; 16:5; హోషేయ 3:5; యిర్మీయా 33:20, 21; యెహెజ్కేలు 34:23, 24; 37:24, 25. ("నేడు నిన్ను కనియున్నాను," కీర్తన. 2:7) అనే ప్రవచనం యొక్క తొలి నెరవేర్పు ఆయన పునరుత్థానమందు జరిగింది, పెంతెకొస్తు దినమున ఆయన పట్టాభిషేకమందును నెరవేర్చబడింది (హెబ్రీ. 1:1-5). ఆ దినమున ఆయన దేవుని కుడిపార్శ్వమున ప్రాముఖ్యమైన స్థానమును ఆక్రమించి సర్వాధికారము పొంది (అపొ. 2:34; హెబ్రీ. 1:3), కీర్తన. 110:1ని నెరవేర్చాడు. ముందుగా చెప్పబడినట్టే, దావీదు తాళపు చెవులు (యెషయా 22:22) ప్రభువైన యేసు పొందాడు (ప్రకటన 3:7). పరలోకమందున్న దేవుడు యేసును, "దేవా" అని సంబోధించాడు (కీర్తన. 45:6; హెబ్రీ. 1:8, 9).

పైగా, యేసు రాజుగా కిరీటము ధరించినప్పుడే, ఆయన ప్రధాన యాజకుడుగా కూడా చేయబడ్డాడు (హెబ్రీ. 5:5). ఇది కూడా ముందుగా ప్రవచింపబడిందే (కీర్తన. 110:4). వినని, మరువరాని ప్రవచనాలు భద్రంగా నెరవేర్చబడ్డాయి! దావీదు కుమారుడు శాశ్వతంగా మరణాన్ని జయించినవాడై, దేవుని కుమారుడని పిలువబడి, దేవుని కుడిపార్శ్వమున దావీదుకు ప్రభువుగా చేయబడి, సర్వాధికారాన్ని స్వీకరించినవాడై, ప్రధాన యాజకుడై, "దేవుడు"గా మర్యాద పొందాడు!

వెనక్కి చూస్తే, "దావీదు కుమారుడు" అనే దానిలో అనేక ప్రవచనాలు చేర్చబడినట్టు ఒకడు కనుగొనగలడు. వాగ్దానం చేయబడినవాడు దావీదు సంతతివాడు (2 సమూ. 7:12), దావీదు (హోషేయ 3:5), దావీదుకు ప్రభువు (కీర్తన. 110:1), కాపరి (యెహెజ్కేలు 37:24, 25), యాజకుడు (కీర్తన. 110:4), ఆశ్చర్యకరమైన ఆలోచన కర్త (యెషయా 9:6), బలవంతుడగు దేవుడు (యెషయా 9:6). నిత్యుడగు తండ్రి (యెషయా 9:6), సమాధాన కర్తయగు అధిపతి (యెషయా 9:6); దేవుని కుమారుడు (2 సమూ. 7:14), మరియు దేవుడు (కీర్తన. 45:6). ఆయనకు దావీదు సింహాసనము (కీర్తన. 89:35, 36), దావీదు తాళపు చెవులు (యెషయా 22:22), "దావీదునకు చూపిన శాశ్వత కృప" (యెషయా 55:3) కలిగి ఉంటాడు.

## బేత్లెహేమీయుడు (మీకా 5:2)

క్రీ.పూ. ఎనిమిదవ శతాబ్దంలో, మోరష్తీయుడైన మీకాకు దేవుని వాక్యం ప్రత్యక్ష మయ్యింది. ఇతర ప్రవచనములతోపాటు, ఒక అల్ప గ్రామాన్ని దేవుడు సూటిగా చూపించి,

అది ప్రఖ్యాతిగాంచునదిగా నియమించాడు: "బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్ప గ్రామమైనను నాకొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును; పురాతన కాలము మొదలుకొని శాశ్వతకాలము ఆయన ప్రత్యక్షమగు చుండెను" (మీకా 5:2).

ఏడువందల సంవత్సరాలకంటె ఎక్కువ కాలం గడచిన తరువాత, ఒక భర్త, అతని భార్య (కన్యయు గర్భవతియైనదియు) నజరేతునుండి బేత్లెహేమునకు ప్రయాణం చేశారు. వారు అక్కడ ఉండగా, ఆమె తన తొలిచూలు కుమారుని కన్నది. అప్పుడు, నక్షత్రం ద్వారా నడిపింపబడి, నూతనంగా యూదులకు రాజుగా పుట్టినవాని గూర్చి జ్ఞానులు విచారణ చేయనారంభించారు. వారు వెదకుతున్న రాజు ప్రవచనంలోని క్రీస్తయి ఉండవచ్చు నేమోయని ఆశ్చర్యపడుచు, రాజైన హేరోదు కలవరపడ్డాడు. క్రీస్తు జన్మ స్థలము ప్రవచింపబడిన సంగతి అతడెరిగియున్నట్టున్నాడు, అయితే అది ఏ స్థలమో తెలిసికొౌన డానికి అతడు మనస్సు పెట్టలేదు. "క్రీస్తు ఎక్కడ జన్మిస్తాడో నేను ఖచ్చితంగా తెలిసికొంటే, నేను (ఆ విరోధియైన) పోటీపడే రాజును కనుగొని, అతన్ని లేకుండా చేస్తాను" అని అతడు తలంచాడు. "కాబట్టి రాజు ప్రధాన యాజకులను ప్రజలలోనుండు శాస్త్రులను అందరిని సమకూర్చి క్రీస్తు ఎక్కడ పుట్టునని వారినడిగెను" (మత్తయి 2:4). పాత నిబంధన బాగుగా చదివినవారు, "– యూదయ దేశపు బేత్లెహేములోనే; ఏలయనగా ... అని ప్రవక్త ద్వారా వ్రాయబడియున్నది" అని అన్నారు (మత్తయి 2:5).

క్రీస్తు జన్మ స్థానము ఏదైయుండాలి అనేదానికి యూదుల మనస్సుల్లో ఏ సందేహము లేదు అనడానికి, సంవత్సరాల తదుపరి మరొక సంఘటన జరిగింది. వారీవిధంగా తర్కించుకున్నారు: "క్రీస్తు దావీదు సంతానములో పుట్టి దావీదు ఉండిన బేత్లెహేమను గ్రామములోనుండి వచ్చునని లేఖనము చెప్పుటలేదా అనిరి" (యోహాను 7:42).

## ఐగుప్తునుండి పిలువబడ్డాడు (హోషేయ 11:1)

ఏకంగా, ముప్పై లక్షలమంది ఇశ్రాయేలు ప్రజలందరు ఒకే వ్యక్తియన్నట్టు దేవునిచే చూడబడి, తండ్రికి కుమారుడెట్లో వారు ఆయనకు ఆలాటి సంబంధం గలవారైయున్నట్టు పిలువబడ్డారు. యెహోవా సెలవిచ్చునదేమనగా, "ఇశ్రాయేలు నా కుమారుడు ..." (నిర్గమ. 4:22బి). ఈ కుమారుడు ఆయనకు బహు ప్రియుడైనందున, తన కుమారుడు ఐగుప్తు దాస్యంలో చాలా శ్రమ పడుతున్నందువల్ల, దయగల తండ్రి నొచ్చుకున్నాడు. బలమైన హస్తముచేతను, చాచిన బాహువుచేతను, మోషేను నాయకుడుగా నిలబెట్టి, ఫరోయొక్క అమానుషపు సేవనుండి తన కుమారుని దేవుడు బయటికి నడిపించాడు. "ఇశ్రాయేలు బాలుడైయుండగా నేను అతని యెడల ప్రేమ కలిగి నా కుమారుని ఐగుప్తు దేశములోనుండి పిలిచితిని" (హోషేయ 11:1). ఐగుప్తు దేశమునుండి ప్రయాణమై, బాల్య దశలోని దేశము ఇశ్రాయేలు దేశానికి లేక పాలస్తీనాకు వస్తున్న, అతణ్ణి దేవుని కుమారుడు అని పిలిచింది.

క్రీ.పూ. 750 ప్రాంతంలో, దేవుడు హోషేయను ప్రేరేపించి, తాను ఇశ్రాయేలును ప్రేమించి తన కుమారుని ఐగుప్తునుండి పిలిచినట్లు రాయించాడు. ఆయన ఒకవైపు

జ్ఞాపకం చేసికొంటున్నాడు, మరోవైపు ప్రవచిస్తున్నాడు. ఒకేసారి ఆయన వెనుకవైపుకు, ముందువైపుకు చూస్తున్నాడు. దేవుని కుమారుడు (తరువాత ఇశ్రాయేలు దేశము అని పిలువబడిన) ఐగుప్తును విడిచి పాలస్తీనాకు వెళ్లుతున్నప్పటి, రమారమి 750 సంవత్సరాల వెనుకకు చూచాడు. మరొక దేవుని కుమారుని కొరకు, దేవుని అద్వితీయ కుమారుడు, ఐగుప్తును విడిచి ఇశ్రాయేలు దేశమైన పాలస్తీనాకు వెళ్లుతున్నట్టు మరో 750 సంవత్సరాలు ముందుకు చూచాడు. ఇశ్రాయేలు దేశము బాల్య దశలోని "బిడ్డగా"నున్న ఆ కాలానికి వెనుకకు చూచాడు. ఇశ్రాయేలుకు పోలికగానున్న యేసు, బాలుడుగా వస్తాడన్న సమయానికి ముందువైపు చూచాడు. దుష్టుడైన ఫరోరాజు దేవుని కుమారుని బాధించుతున్న వెనుకతట్టుకు చూచాడు. మరొక దుష్టుడైన హేరోదు రాజు దేవుని కుమారుని నాశనం చేయజూచే సమయం కొరకు ముందుకు చూచాడు.

ఆయన ఇశ్రాయేలీయుల గతాన్ని గూర్చి జ్ఞాపకం చేసికొంటుండగా, హోషేయ కలము ద్వారా దేవుడు భవిష్యత్తు కొరకు కూడా ఒక సందేశాన్ని పంపుతున్నాడు. మత్తయి 2:19–21లో దాని భావము బయలుపరచబడింది:

> హేరోదు చనిపోయిన తరువాత ఇదిగో **ప్రభువు** దూత ఐగుప్తులో యోసేపునకు స్వప్నమందు ప్రత్యక్షమై – నీవు లేచి, శిశువును తల్లిని తోడుకొని, ఇశ్రాయేలు దేశమునకు వెళ్లుము; శిశువు ప్రాణము తీయజూచుచుండినవారు చనిపోయిరని చెప్పెను. అప్పుడతడు లేచి, శిశువును తల్లిని తోడుకొని ఇశ్రాయేలు దేశమునకు వచ్చెను.

యోసేపు దేవదూతకు లోబడినప్పుడు, హోషేయ 11:1లోని ప్రవచనపు భావాన్ని నెరవేర్చుటలో అతడు దేవుని సాధనమైయున్నాడు. "ఐగుప్తులోనుండి నా కుమారుని పిలిచితిని అని ప్రవక్త ద్వారా **ప్రభువు** సెలవిచ్చిన మాట నెరవేర్చబడునట్లు ..." (మత్తయి 2:15) ఇదంతయు జరిగెను.

నిర్దిష్టమైన పాత నిబంధన అర్థముతోను, మరి శ్రేష్ఠమైన క్రొత్త నిబంధన ప్రాధాన్యతతో కూడిన మరియొక విశేషమైన పాత నిబంధన వాక్య భాగం హోషేయ 11:1.

## ముప్పది వెండి నాణెములకు అమ్మెను (జెకర్యా 11:12)

ఆరవ శాతాబ్దపు ప్రవక్తయైన జెకర్యా ప్రకారం, మాటతో మోసగించువాడు రక్తాన్నమ్మి ధనాన్ని పొందుతాడు: "–మీకు అనుకూలమైన యెడల నా కూలి నాకియ్యుడి, లేనియెడల మానివేయుడి ..." (జెకర్యా 11:12ఎ). బెదిరింపులతో కుట్ర పన్నువారు ఈ షరతులకు అంగీకరిస్తారని ప్రవక్త ప్రవచించాడు, మరియు ముందుగా చెప్పే వ్యక్తి, ఈ మాటలను ఆ ద్రోహి మాటలలో పెట్టుతున్నాడు: "వారు నా కూలికై ముప్పది తులముల వెండి తూచి యిచ్చిరి" (జెకర్యా 11:12బి). ఒక వెండి నాణ్యం రమారమి 64 సెంట్సటు, ముప్పది వెండి నాణ్యాలు ఒక బానిస యొక్క వెల (నిర్గమ. 21:32).

రమారమి అయిదువందల సంవత్సరాల తరువాత, జెకర్యా ప్రవచనం యొక్క నెరవేర్పు బహు సుప్రసిద్ధమైనది: "అప్పుడు పండ్రెండుమందిలో నొకడగు ఇస్కరియోతు యూదా,

ప్రధానయాజకులయొద్దకు వెళ్లి – నేనాయనను మీకప్పగించినయెడల నాకేమి ఇత్తురని వారినడిగెను. అందుకు వారు ముప్పది వెండి నాణెములు తూచి వానికి ఇచ్చిరి" (మత్తయి 26:14, 15).

## దేవునిచే విడువబడినవాడు (కీర్తన. 22:1)

దావీదు అనేకసార్లు, సౌలుచేతనే గాని లేక అబ్షాలోముచేతనే గాని తరుమబడినప్పుడు ఒక గుహలో గాని, అడవులలో గాని దాగేలా బలవంతం చేయబడ్డాడు. ఆ సమయాల్లో, దేవుడు తన సహాయాన్ని వెనుకకు తీసికొన్నట్టు అతడు తలంచియుండవచ్చు. అత్యవసర సమయాల్లో, "నాకును మరణమునకును అడుగు మాత్రమున్నదని" అనేవాడు (1 సమూ. 20:3), "నా దేవా, నా దేవా, నీవు నన్నేల విడనాడితివి?" (కీర్తన. 22:1ఎ) అని విలపించడం కేవలం దావీదు యొక్క మానవత్వాన్ని సూచిస్తుంది. దేవుడు అతన్ని విడిచిపెట్టలేదు, ఎందుకంటే – అబద్ధమాడనేరని దేవుడు–పక్షపాతం చూపని దేవుడు – "నేను నిన్ను విడువను, ఎడబాయనని" వాగ్దానం చేశాడు (యెహోషువ 1:5సి; హెబ్రీ. 13:5 కూడా చూడు). అయినా, మానవునిగా మాట్లాడినప్పుడు, దావీదు దేవునిచే విడువ బడినట్టు భావించాడు, అతని దుఃఖం అర్థం చేసికోదగిందే.

వెయ్యి సంవత్సరముల తరువాత, దావీదు కుమారుడు, తన శత్రువులచే హింస పెట్టబడి, సిలువపైనుండి, "నా దేవా, నా దేవా, నీవు నన్నేల విడనాడితివి?" అని బిగ్గరగా కేకవేశాడు (మత్తయి 27:46బి). యేసును సూర్యుని వెలుగు పన్నెండునుండి మూడు గంటలవరకు విడిచిపోయింది, మరియు దేవుడు ఆయన యొద్దనుండి తిరిగిపోయాడు. దావీదు విషయంలో దేవుడు అతని విడిచిపెట్టింది నిజం కాదు: అది తొందరలో, వ్యాకులతలో మనిషికి కేవలం అలా అనిపించింది. యేసు విషయంలో దేవుడు విడనాడింది నిజం: సిలువ మరణపు గడియలలో, యేసు పాపం యొక్క ప్రతిరూపం. "మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2 కొరింథీ. 5:21). దుష్టత్వమును చూడలేనంత నిష్కళంకుడైనందున (హబక్కూకు 1:13), దేవుడు తన కన్నులను తిప్పుకోవలసి వచ్చింది. ప్రభువైన యేసుకు ఆ సంగతి తెలుసు, తన ఉనికిలో మొదటిసారిగా తన తండ్రి తననుండి ముఖం తిప్పుకొన్నాడు.

పైగా ధర్మశాస్త్రం యిలా అంటుంది: "వ్రేలాడదీయబడినవాడు దేవునికి శాపగ్రస్తుడు" (ద్వితీయో. 21:23); "మ్రానుమీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు" (గలతీ. 3:13బి). క్రీస్తు మన కోసము శపింపబడ్డాడు.

ఆయన ఏ రూపంలో కూడా దీనికి ఏ మాత్రము పాత్రుడుకాడు. ఎవరికి దెబ్బలు పడాలో వారు ఉచితంగా పంపివేయబడ్డారు (యెషయా 53:8), "యెహోవా మనయందరి దోషమును అతనిమీద మోపెను" (యెషయా 53:6). ఆనందదాయకమైన దినాలలో, "నన్ను పంపినవాడు నాకు తోడైయున్నాడు...ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదు" అనే అభయంతో ఆనందించేవాడు (యోహాను 8:29బి). "నీవు ఎల్లప్పుడును నా మనవి వినుచున్నావని నేనెరుగుదును" అని నమ్మికతో ఉండేవాడు (యోహాను 11:42ఎ), ఏది

యెలాగున్నా సిలువపై మాత్రం, దేవుడు ఆలకించలేదు సరిగదా, దేవుడు ఆయనను ఒంటరిగా వదలివేశాడు, చాలా ఒంటరిగా! ఆ ఒంటరితనాన్ని యేసు అనుభవించాడు!

లోకాన్ని రక్షించాలంటే, తాను పాపిగా చేయబడాలనే సంగతి యేసుకు తెలుసు, మరియు అలా చేయడంలో, ఆయన దేవునిచే విడువబడినవాడు కావాలి. తన వద్ద తండ్రి హాజరుకాలేదని ఆయన ఎరిగియుంటే, అప్పుడు ఆయన అంత పెద్ద శబ్దంతో ఎందుకు కేకవేయాలి? ఈ జీవితంలో మనం దాన్ని ఎరుగలేకపోవచ్చు; తీక్షణమైన వేదనలో ఉన్నందున అది యేసులోని మానవ భాగమై ఉండవచ్చునేమో.

## తిరిగి జీవించిన శవం (కీర్తన. 16:10)

కీర్తన. 16:10 కేవలం యేసుకు సంబంధించిన ప్రవచనంలా గోచరిస్తుంది. "ఎందుకనగా నీవు నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు నీ పరిశుద్ధుని కుళ్లుపట్టనియ్యవు" (కీర్తన. 16:10), ప్రత్యేకమైన ఈ ప్రవచనంలో, దావీదు తన్ను గూర్చి వ్రాయడంలేదు. అతడు చనిపోయిన తరువాత, "తన పితరుల యొద్దకు చేర్చబడి కుళ్లిపోయెను" (అపొ. 13:36). వెయ్యి సంవత్సరాల తరువాత, తెరువబడని దావీదు సమాధిని పేతురు సూచించాడు: "సహోదరులారా, మూలపురుషుడగు దావీదును గూర్చి మీతో నేను ధారాళముగా మాటలాడవచ్చును. అతడు చనిపోయి సమాధి చేయబడెను; అతని సమాధి నేటివరకు మన మధ్యనున్నది" (అపొ. 2:29).

ప్రవక్తయైయుండి (అపొ. 2:30), దావీదు ముందుగా తెలుసుకున్నాడు (అపొ. 2:31). అతడు కీర్తన. 16:10 వ్రాసేటప్పుడు, అతడు "క్రీస్తు పునరుత్థానాన్ని" గూర్చి, "ఆయన పాతాళంలో విడువబడలేదనియు, ఆయన శరీరము కుళ్లిపోలేదనియు," "ఈ యేసును దేవుడు లేపెను" అని పలికాడు (అపొ. 2:31, 32ఎ). మరియు "దేవుడు లేపినవాడు కుళ్లు పట్టలేదు" (అపొ. 13:37).

## మెస్సీయాను గూర్చి ఏర్పరచుకున్న ప్రవచనాలు మరియు వాటి నెరవేర్పులు

| ప్రవచనము | ప్రవచింపబడింది | నెరవేర్పు |
|---|---|---|
| స్త్రీ సంతానము | ఆది. 3:15 | గలతీ. 4:4; రోమా 16:20 |
| అబ్రాహాము సంతానము | ఆది. 12:1-3 | గలతీ. 3:16 |
| యూదా గోత్రము | ఆది. 49:10 | హెబ్రీ. 7:14 |
| దావీదు సంతానము | కీర్తన. 89:3, 4 | రోమా 1:2-7 |
| కన్యగర్భమందు జన్మ | యెషయా 7:14 | మత్తయి 1:22, 23 |
| జన్మస్థానము బేత్లెహేము | మీకా 5:2 | మత్తయి 2:1, 5 |
| ముందుగా పంపబడినవాడు | యెషయా 40:3 | మత్తయి 3:1, 3 |
| గలిలయ సందర్శనం | యెషయా 9:1, 2 | మత్తయి 4:12-16 |
| ఆయన జ్ఞానము | యెషయా 11:1-3; కీర్తన 78:2 | మత్తయి13:55; లూకా 7:15,46 |
| ఆయన పనులు | యెషయా 35:5; 61:1-3 | మత్తయి 11:2-6 |
| ఆయన ఆసక్తి | కీర్తన. 69:9 | యోహాను 2:16, 17 |
| ఆయన నిరాకరించబడడం | యెషయా 53:3 | యోహాను 1:11 |
| వ్యసనాక్రాంతుడు | యెషయా 53:3 | మత్తయి 26:38 |
| బాధననుభవించినవాడు | యెషయా 53:3 | యోహాను 11:35 |
| ఆయన గాయములు | యెషయా 53:3 | 1 పేతురు 2:24 |
| పాపమును భరించువాడు | యెషయా 53:11, 12 | 2 కొరింథీ. 5:21 |
| ఎదురించనివాడు | యెషయా 53:7 | యోహాను 18:8; 1 పేతురు 2:23, 24 |
| ఆయన శిష్యుల పిరికితనం | జెకర్యా 13:7 | మత్తయి 26:31-36 |
| ఆయన అప్పగింపబడడం | కీర్తన. 41:9; 55:12-15 | యోహాను 13:18 |
| రక్త క్రయధనం | జెకర్యా 11:12 | మత్తయి 26:14, 15 |
| రక్త క్రయధనాన్ని పారవేయడం | జెకర్యా 11:13 | మత్తయి 27:5-7 |
| ఉమ్మివేయడం, కొరడాలతో కొట్టడం | యెషయా 50:6 | మత్తయి 27:26, 30 |
| అక్రమకారులతో చేర్చబడ్డాడు | యెషయా 53:12 | మార్కు 15:27, 28 |
| చేదుకలిపిన చిరక | కీర్తన. 69:21 | మత్తయి 27:34; యోహాను 19:28-30 |
| అపహసింపబడ్డాడు | కీర్తన. 22:7, 8 | మత్తయి 27:35; యోహాను19:23, 28 |
| ఆయన వస్త్రములు విభాగింపబడ్డాయి | కీర్తన. 22:18 | మత్తయి 27:35; యోహాను 19:23-28 |
| ఆయన చేతులు కాళ్లు గ్రుచ్చబడ్డాయి | కీర్తన. 22:16; జెకర్యా 12:10 | యోహాను 19:37 |
| దేవునిచే విడువబడ్డాడు | కీర్తన. 22:1 | మత్తయి 27:46 |
| ఎముకలు విరువబడలేదు | కీర్తన. 34:20 | యోహాను 19:33-36 |
| విజ్ఞాపన చేయడం | యెషయా 53:12 | లూకా 23:34 |
| తన ఆత్మను అప్పగించడం | కీర్తన. 31:5 | లూకా 23:46 |
| ధనవంతునిచే సమాధి | యెషయా 53:9 | మత్తయి 27:57-60 |
| కుళ్లపట్టడు | కీర్తన. 16:8-10 | అపొ. 2:31 |
| ఆయన ఆరోహణం | కీర్తన. 24:7-10; 68:18 | అపొ. 1:9; ఎఫెసీ. 4:8 |
| రాజుగా చేయబడడం | కీర్తన. 45:6, 7; 110:1-5 | హెబ్రీ. 1:8, 9 |